ఏకగ్రీవంగా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గురువారం స్థానిక సిఎల్ఆర్‌సి భవనంలో విలేకరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా షేక్ ఖాదర్ బాష, అధ్యక్షులుగా మల్లెల జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా ఎ.రామాంజులు, ఎన్.నాగరాజ, జానం గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జలకనూరి చంద్రశేఖర్ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రవి కిషోర్, కోశాధికారిగా గండికోట వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా బండి రామచంద్ర, తులసి కృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులుగా పటాన్ జాకీర్, గౌరవ సలహాదారుగా జమీల గౌస్, న్యాయ సలహాదారుగా హారీష్ అలీ, పది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కమిటీ సభ్యులమందరం సమన్వయంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన సభ్యులకు ప్రభుత్వ ఇంటి స్థలాలు, వారి పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల్లో రాయితీ, ఇతర సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడుతామన్నారు. ఈ ఎన్నికలు సీనియర్ జర్నలిస్టు పఠాన్ జాకీర్ హుస్సేన్, అల్తాఫ్ హుస్సేన్ పర్యవేక్షణలో జరిగాయి.

జిల్లా అంతటినీ కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇప్పటికి ప్రకటించిన కరువు మండలాలు కంటే ఎక్కువగా ఉన్నాయని వాటినీ ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురం రామచంద్ర, ఉపాధ్యక్షులు నాగ బసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికీ మన జిల్లాలో 18 మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రకటించారు అన్నారు. మిగిలిన 12ను కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతులును, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు పశుగ్రాసం లేక పాడిపశువులు, గొర్రెలు ఇతర వాటిని ఇప్పటికే కబేళాలకు తరలిస్తున్నారని వాపోయారు. వెంటనే పశుగ్రాసంతో పాటు రైతన్నలు అదుకోవాలన్నారు. అరకొర వర్షాలతో పండించిన పంటలు చేతికి రాకపోవడంతో రైతాంగం సంక్షోభంలో పడిందని, ప్రభుత్వం రైతులకు పంట నష్టం కింద రూ. 50 వేలు , పంట పెట్టని రైతులకు 20 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. రైతన్నలు బ్యాంకుల్లో తీసకున్న రుణం రూ. 2 లక్షల మాఫీ చేయాలన్నారు. అన్ని మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాయచోటిటౌన్ : జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోందని, సాధారణం కంటే కూడా తక్కువ వర్షపాతం నమోదైందని, సగానికి పైగా పంట సాగు తగ్గిపోయిందని ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాల్లో అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తూతూమంత్రంగా కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022-23 ఖరీఫ్ సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, కనీసం పెట్టుబడులైనా వస్తాయని ఆశించిన రైతులకు పశు గ్రాసం కూడా మిగలని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 3 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. 27 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదై 23 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వం 18 మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. ఖరీఫ్ పంట దిగుబడి నష్టం, వర్షాభావ పరిస్థితులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను లెక్కించి జిల్లాలో నెలకొన్న కరవుపై అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి సాగు దుస్థితిని అంచనా వేసి అధికారులు చేసిన ప్రతిపాదనలకు, ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాకు పొంతన లేకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని లేని పక్షంలో రైతులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సు డ్రైవర్లకు భద్రత కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాయచోటి డిపో కేంద్రం నుంచి వేంపల్లెకు డ్రైవర్ పెదవీటి నరసింహులు బుధవారం సాయంత్రం 76 మంది ప్రయాణికులు, మరో 50 మంది విద్యార్థులతో కిక్కిరిసిన బస్సుతో వెళ్తున్నారని తెలిపారు. నాగులగుట్టపల్లి వద్ద కొంతమంది బస్సు ఆపారని, ‘ బస్సులో ఖాళీలేదని వెనుక మరో బస్సు వస్తుంది’ అని చెప్పి ముందుకెళ్లారని చెప్పారు. బస్సు నిలబెట్టలేని రామ్మోహన్ అనే వ్యక్తి కారులో వెంబడించి మరో కొంతమందితో కలసి చక్రాయపేట వద్ద బస్సు ఆపి డ్రైవర్‌ను చితకబాది చంపేస్తానని పోలీసుల ముందే బెదిరించాడని పేర్కొన్నారు. పోలీసులు డ్రైవర్‌ను కాపాడి టీచర్‌ని అదుపులో తీసుకున్నారని చెప్పారు. చక్రాయపేట సర్పంచ్ జోక్యం చేసుకుని కేసు లేకుండా డ్రైవర్ని బెదిరించారని తెలిపారు. దాడి చేసింది ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తూతూ మంత్రంగా 341, 323, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. వెంటనే అతన్ని విధుల నుంచి తొలగించాలని కడప డిఇఒకు ఎఫ్ఐఆర్ కాపీని పంపాలన్నారు. నిత్యం ప్రజానీకాన్ని సురక్షితంగా వారిని గమ్య స్థానాలకు చేరుస్తున్న డ్రైవర్ల పట్ల చిన్న చూపుతగదని హితవు పలికారు. భవిష్యత్తో డ్రైవర్ల మీద దాడుల నివారణకు, రక్షణకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని లేని పక్షాన డ్రైవర్లతో కలసి పెద్ద ఎత్తున సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, ఆర్‌టిసి కార్మికులు

కార్యక్రమంలో భాధిత డ్రైవర్ నరసింహులు, డైవర్లు కర్ణ, మహమ్మద్, రమణ, నాగరాజు, అస్లామ్, సురేష్‌రెడ్డి, రామాంజులు పాల్గొన్నారు. **దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి :** రాయచోటి డిపోనకు చెందిన అద్దెబస్సు డ్రైవరుపై దాడ చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని రాయచోటి డిపో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.ఎన్.బి.రెడ్డి, అధ్యక్షులు సమద్, డిపో కార్యదర్శి ఈశ్వరరెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వాహణలో ఉన్న ఆర్‌టిసి సిబ్బంది తప్పు చేస్తే డిపో మేనేజర్‌కు కానీ, ఉన్నతాధికారులకు కానీ ఫిర్యాదు చేయాలే తప్ప దాడి చేయడం సబబు కాదని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి వెంకటరమణ

జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అన్నమయ్య జిల్లా కేంద్రానికి వాల్మీకిపురం నుంచి బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వైస్ ఎంపిపి వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వస్తున్న సమస్యలను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు ఇస్తున్నారని, ఆయా సచివాలయాల పరిధిలో గల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వాల్మీకిపురం నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటి, వాల్మీకిపురం నుంచి నిమ్మనపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా మండలంలో జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే సమావేశంలో వచ్చిన సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ ఫిరోజ్ ఖాన్, జడ్‌పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, ఇఒ ఉదయ్ కుమార్, డైరెక్టర్లు అబ్దుల్ కలీమ్, నరసింహులు, నల్లంకి నరసింహులు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘మిట్స్’లో ఘనంగా ఐఇఇఇ డే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఐఇఇఇ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్) డేను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కలశాల ప్రొఫెసర్ బసాబి చక్రబర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఐఇఇఇ సెక్షన్‌లు, స్టూడెంట్ బ్రాంచ్‌లు, అఫినిటీ గ్రూపులు, సొసైటీ చాప్టర్‌ల నుండి ఐఇఇఇ సభ్యులు ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంజినీర్లు తమ సాంకేతిక ఆలోచనలను పంచుకోవడానికి సమావేశమైనప్పుడు వారికి ఉన్న ఈ ఆలోచనలే నూతన పరిశోధనలకు నాది అవుతాయన్నారు. మనం ఒక్కసారి అందరూ మనకు ఇష్టమైన ఇంటర్నెట్, వైఫై బ్లూటూత్ యాక్సెస్ చేయలేని ప్రపంచాన్ని ఊహించండి, అది చాలా కష్టం అదే విధంగా మనకు పరిశోధనలో నాణ్యత ప్రమాణాలు లేని పరిశోధనలు కూడా మనం చూడలేమన్నారు. ప్రపంచంలో రాను రాను నాణ్యతతో కూడిన పరిశోదనలు మనం చూడలేమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐఇఇఇ మెంబెర్ షిప్ తీసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ టెక్నికల్ సాహిత్యం యొక్క అతిపెద్ద లైబ్రరీగా ఐఇఇఇని చెపకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ ప్రెసెంటేషన్, టెక్నికల్ క్విజ్, వర్క్షాప్ వంటి మొదలైన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రం, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఐఇఇఇ కో-ఆర్డినేటర్ సి.కుమార్ పాల్గొన్నారు.

అంకాళమ్మకు బంగారు బొట్లు వితరణ

ప్రజాశక్తి-పీలేరు: ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో వెలిసిన అంకాళమ్మకు ఆలయ కమిటీ సభ్యులు శ్రీపురం నాగమణి వెంకటేష్ బంగారు బొట్లను సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉన్న బంగారు బొట్లు ఇటీవల చోరీకి గురయ్యాయి. గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చి 2.130 గ్రాముల రెండు బంగారు బొట్లను ఆలయ కమిటీ చైర్మన్ మాధవరం భాస్కర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గుడి పూజారి ఎ.ఆంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసులు పెట్టి వేధించడం జగన్ నైజం : ‘బత్యాల’

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అడ్డగోలుగా కేసులు, తప్పుడు ఆరోపణలు చేయడం తప్ప సిఎం జగన్ సాధించిందేమీ లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం టెండర్లలో చంద్రబాబు తప్పు చేశారని కేసులు బనాయించడం సరికాదన్నారు. రూపాయి అవినీతి నిరూపించకుండా స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతూ ఫైబర్ గ్రిడ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు ఘటనల పైన కేసు పెట్టి వేధించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. చివరికి బాబుకు మెయిల్ సత్యమని తెలియడంతో అప్పటికప్పుడు మద్యం టెండర్లలో ఏదో జరిగిపోయిందంటూ కేసు పెట్టారని, నిరాధారమైన ఆ కేసు నిలబడదన్నారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ మండలాధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి అబూబకర్, కొండయ్య నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, జడ శివ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** రూపాయి అవినీతి నిరూపించకుండా స్కిల్ డెవలప్మెంట్‌లో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసులు పెట్టడం తప్ప నాలుగున్నర సంవత్సరాలుగా చంద్రబాబు రూపాయి అవినీతిని చేసాడని నిరూపించలేక అధికార దుర్వినియోగంతో అక్రమంగా అరెస్టు చేసి వ్యవస్థలను అడ్డుపెట్టుకొని రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు దొమ్మలపాటి యశ్వి రాజ్, మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఓటమి భయంతోనే చంద్రబాబుపై జగన్ వరుసగా అక్రమ కేసులు పెడుతున్నారని టిడిపి రాజంపేట బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ ఆరోపించారు. గురువారం పార్లమెంట్ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలే లక్ష్యంగా వైసిపి కేసులు, వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎ.మస్తాన్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొర స్వామి నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, మాజీ ఎంపిటిసి శివన్న పాల్గొన్నారు.

రాజంపేట : సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు

వైసిపి పాలనలో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి పాలనలో రాష్ట్రం రూ.11 లక్షల కోట్ల రుణభారంలో ఉందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని బోయినపల్లిలోని చేనేత కార్మికులను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలతో బతుకు జీవనం కష్టమైందని చేనేత కార్మికులు మొరపెట్టుకున్నారు. చేనేతలకు నేతల నేస్తం అనే పథకాన్ని ప్రవేశపెట్టి అనేక నిబంధనలు విధించి సిఎం చేనేతల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. చేనేతలనే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం పట్టి పీడిస్తోందని తెలిపారు. వైసిపిని వచ్చే ఎన్నికలలో నామరూపాలు లేకుండా ఓడించడమే ప్రజల తక్షణ కర్తవ్యమన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ ఆధ్వర్యంలో రోడ్డు, భవనాల శాఖ కార్యాలయం వద్దకు చేరుకొని అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో రాజంపేటకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నందలూరు ప్రజలకు తాగునీటి వరద తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఎమ్మెల్యే మల్లిఖార్జునరెడ్డి బాబాయ్ భాస్కర్‌రెడ్డి స్వాహా చేశారని ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి కేంద్రీయ విద్యాలయం తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. రాయలసీమలో కరువు విలయతాండవం చేస్తుంటే కేవలం 120 మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం అన్యాయమని వివరించారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి మూడు సంవత్సరాలు కావస్తున్నా వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట శివ నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి చంద్రమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ రాజు, బిజెపి నాయకులు షబ్బీర్ అహ్మద్, టి.హరి ప్రసాద్, పట్టుకోగుల ఆదినారాయణ, జికె.నాగరాజు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని జగనన్న లే అవుట్ కాలనీలలో ఇప్పటికే గుర్తించిన మౌలిక వసతుల సమస్యలను పది రోజుల్లోగా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష గృహ నిర్మాణ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని జగనన్న లేఅవుట్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు తీసుకున్న చర్యలపై హౌసింగ్, పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎపి ఎస్‌పిడిసిఎల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం ఎన్ని జగనన్న లేఅవుట్ కాలనీలో ఉన్నాయి, నియోజకవర్గాల వారీగా ఎన్ని కాలనీలలో మౌలిక వసతుల సమస్యలను గుర్తించారని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లాలో మొత్తం పట్టణ గ్రామీణ ప్రాంతాలలో 512 జగనన్న లేఅవుట్ కాలనీలున్నాయని, అందులో 258 కాలనీలలో నీటి వసతికి పైప్ లైన్ ఏర్పాట్లు, ఇంటింటికి కుళాయి, విద్యుత్ సౌకర్యంలో భాగంగా షిఫ్టింగ్ ఆఫ్ పోల్స్, మీటర్ల ఏర్పాటు అంశాలలో సమస్యలను గుర్తించినట్టు హౌసింగ్ అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కాలనీలలో గుర్తించిన సమస్యలను ఎట్టి పరిస్థితులలో పది రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కాలనీలో తప్పనిసరిగా చిన్న తరహా నీటి ట్యాంకులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి పూర్తయిన ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పులపత్తూరులో జిఎల్ఎస్ఆర్ నీటి ట్యాంకును ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 10 జగనన్న లేఅవుట్ కాలనీలలో నూతనంగా అనుమతులు అవసరమని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే అనుమతులు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో సాయినగర్‌లో ఉన్న రంగయ్య నవోదయ, సైనిక్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడంలో విద్యా శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులను తీరును నిరసిస్తూ గురువారం పట్టణంలో విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా జిల్లా అధ్యక్షులు నాగేశ్వర మాట్లాడుతూ కోచింగ్ సెంటర్లపై చర్యలు చేపట్టాలని కోరుతూ గత శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తంకు చిట్వేలి మండలంలో పత్రం సమర్పించడమైనదని, మండల విద్యాశాఖ అధికారులు కానీ, జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ ఇంతవరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నవోదయ, సైనిక్, ఆర్ఎంఎస్ పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తూ విద్యార్థులకు ఎటువంటి వసతులు కల్పించకుండా ఒక ఇంటి గదిలోని హాలులో దాదాపు 70 నుండి 100 మంది విద్యార్థులను కిక్కిరిసేలా కూర్చోబెట్టి దాదాపు 30 సంవత్సరాల నుండి అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్ నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా అందించకుండా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థు లను కోచింగ్ సెంటర్లో చేర్చుకున్నారని వారి అడ్మిషన్లు, హాజరు ఎక్కడు న్నాయో తెలపాలన్నారు. ఎటువంటి ఫ్యాకల్టీ లేకుండా, కనీసం ప్రత్యేక బిల్డింగ్ లేకుండా, ఎమర్జెన్సీ సేఫ్టీ పరికరాలను కూడా ఉపయోగించకుండా కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, అలా విద్యను వ్యాపారంగా చేస్తున్న వారిపై తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం స్పందించి కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకొని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోని పక్షంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని, అధికారులు ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలపాలని కలెక్టర్‌ను కోరుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌరీశంకర్, చంగయ్య, పిడిఎస్‌యు నాయకులు సుమంత్, హరి పాల్గొన్నారు.

‘రీ-సర్వేను వేగవంతం చేయాలి’

ప్రజాశక్తి - రాయచోటి

రీ సర్వే కార్యక్రమం ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని, ఈ దిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి రీ సర్వేను వేగవంతం చేయాలని సిసిఎల్ఎ స్పెషల్ సిఎస్ జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, రీ సర్వే కార్యాచరణ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కెఆర్‌ఆర్ సిఎస్‌డిసి శ్రీలేఖ హాజరయ్యారు. సిఎస్‌తో విసి ముగిసిన అనంతరం కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే పనులు నిర్దేశించిన గడువు లోపల పూర్తిచేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా చేపట్టాలని ఇందుకు ఆర్డీవోలు, తహాశీల్దార్లు, రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలన్నారు. కోర్టు కేసులను జాగ్రత్తగా పరిశీలించి సమస్యలు లేకుండా చూడా లన్నారు. సర్వేను పూర్తిచేయడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్న విష యాన్ని గుర్తు పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన శ్మశాన వాటికల స్థలాలకు వెంటనే హద్దులు చూపించాలని తహాశీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజ్, డిప్యూటీ తహాశీల్దార్ క్రాంతి కుమార్, సర్వే సిబ్బంది, పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న రాందాస్ చౌదరి

తాగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్లబైలు పంచాయతీ నల్లగుట్టవారిలో 30 రోజుల నుండి తాగునీరు బోరు చెడిపోయిందని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. గురువారం ఎంపిడిఒకు చౌదరి ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, వైఎస్ఆర్ కాలనీ ప్రజలతో కలసి తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు గురించి వినతిపత్రం అందజేశారు. అధికారులు త్వరగా స్పందించి కాలనీ వాసుల నీటి దాహర్తి తీర్చకపోతే జనసేన పార్టీ తరపున పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

5న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు ఉచిత మెగా ఆర్థో క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి బర్డ్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఆకేపాటి ఎస్టేట్లో ఈ నెల 5వ తేదీన ఉచిత మెగా ఆర్థో క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో తిరుపతి, హైదరాబాద్, చెన్నై నుండి మంచి నైపుణ్యం కలిగిన సుమారు 30 మంది డాక్టర్లు హాజరవుతారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్స కూడా ఉచితంగా చేయించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పోలి మురళి, సౌమిత్రి, విశ్వనాథరెడ్డి, దండు గోపి, జాహిద్ అలీ, పెంచలయ్య, రాఘవ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలు స్వామినాగూర్ వలి, నవీన్ చౌదరి, బాలమాలి శేఖర్, నాగమణి మాట్లాడుతూ పట్టణంలోని అమ్మ ఆసుపత్రి ఆధ్వర్యంలో శేష్ మహల్ వెనుక చలపతి డాక్టర్ ఇంటి సమీపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గుండె జబ్బులు, బీ,షుగర్, థైరాయిడ్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.సి.సందీప్, డాక్టర్ ఇ.అంకితా రెడ్డి, డాక్టర్ ఇ.జాన్ ఇసాక్, డాక్టర్ మనోహర్ కుమార్లు పాల్గొంటారన్నారు.


మాట్లాడుతున్న ముకరం చాంద్

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గురువారం జనసేనపార్టీ కార్యాలయాన్ని వర్ధన్నగారి ప్రసాద్, రామ్మూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు రాయుడు, రాజంపేట జనసేన నాయకులు మలిశెట్టి వెంకట రమణ, వెంకటేశ్వరరావు, ముక్రం చాంద్, చెంగారి శివప్రసాద్, టిడిపి నాయకులు ఆర్.సుధాకర్‌నాయుడు, పార్వతి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం కోసమే జనసేన పని చేస్తుందని, పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో టిడిపి జనసేన కూటమి సునామి సృష్టించబోతుందని అన్నారు. ప్రజలను పథకాల పేరుతో మోసగిస్తూ దోచుకు తింటున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని, జనసేన టిడిపి కూటమితో రాష్ట్రంలో అతి త్వరలోనే ప్రజా పాలన వస్తుందని, రాను న్న ఆరు నెలల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి వైసిపి పతనానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.

నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- బి.కొత్తకోట

నీటిపైప్‌లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పట్టణ పరిధిలోని పోకనాటి వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారంకానీ నీటి సమస్యను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంలో భాగంగా నాలుగో సచివాలయం కన్వీనర్ కంచి కల్యాణ్‌కుమార్‌రెడ్డి అధికా రులకు నీటి సమస్య గురించి తెలిపారు.ఈ సమస్యపై తక్షణం స్పందించిన కమిషనర్ పి.ఆర్.మనోహర్, డిటి మహమ్మద్ అన్సారి సత్వరమే సంబంధిత వాటర్ మ్యాన్‌ని పిలిపించి నీటి సమస్యకు పరిష్కరించాలని ఆదేశించారు. ఎలా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందో వాటర్ మెన్ శివ ని తెలపమని అధికారులు కోరారు. ఎస్‌సి కాలనీలో నుంచి పైప్ లైను ఏర్పాటు చేయడం ద్వారా పోకనాటివీధి నీటి సమస్య పరిష్కారం అవుతుందని వాటర్‌మాన్ తెలపడంతో తక్షణం పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలని కమిషనర్ తెలిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి నగర పంచాయతీ సిబ్బంది నీటిని సరఫరా చేశారు.పోకనాటి వీధి ప్రజలు కమిషనర్ పి.ఆర్.మనోహర్, ఎఇ రాజేందర్, కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-పెనగలూరు

పుష్పకుమార్‌ను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన పుష్పకుమార్ అందించిన సేవలు మరువలేనివని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. మండల పరిధిలోని నారాయణ నెల్లూరు సచివాలయంలో పంచా యతీ కార్య దర్శిగా పనిచేసి పుష్పకుమార్ రైల్వే శాఖలో ఇటీవల ఉద్యోగం రావ డంతో పంచాయతీ కార్యదర్శిగా విరమణ చేసి రైల్వే శాఖకు వెళ్లనుండగా గురువారం శాలువాతో ఘనంగా సన్మానించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సహకరించిన సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేత చక్రపాణి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు మంజూరు

ప్రజాశక్తి-గాలివీడు

వంట పాత్రలను పరిశీలిస్తున్న ఎంఇఒ

మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు 88 పాఠశాలకు వంట పాత్రలు మంజూరైనట్లు ఎంఇఒ పిల్లి నాగ రాజు పేర్కొన్నారు. బియ్యం, పప్పు, గుడ్లు ఉడికించేందుకు అన్ని రకాల వస్తువులు ఎంఆర్‌సికి చేరాయని అన్నారు. ఇక నుంచి ఆయా పాఠశాలల వంట ఏజెన్సీ వారికి అప్పగిస్తామని ఆయన తెలిపారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం

ప్రజాశక్తి- నందలూరు

మద్యం కంపెనీల మంజూరు విషయంలో అక్రమ కేసులు బనాయించడం దారుణమని టిడిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్ పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు సూచనల మేరకు గురువారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల వైసిపి ప్రభుత్వంలో అనేక రకాల నకిలీ, పిచ్చి బ్రాండ్లతో మద్యం పంపిణీ చేసి ప్రజల జీవితాలతో ఆడుకోవడమే కాకుండా వేలాది మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారన్నారు. లక్షలాదిమంది ప్రజలు అనారోగ్యం పాలు చేసి, ప్రజల జీవితాలతో ఆటలాడుకోవడం నియంత పాలనకు నిదర్శనమన్నారు. పజలు అన్ని గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టడం ఖాయమని జోస్యం పలికారు. ఈ సమావేశంలో టిడిపి బిసి నేతలు చామంచి పెంచలయ్య, కానుకుర్తి వెంకటయ్య, తెలుగు యువత నాయకుడు తోటశివశంకర్, బిసి నాయకులు కల్లూరు సుబ్బరాయుడు, జాగటి వెంకటరమణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు క్రమశిక్షణతో కలిగిన విద్యను అభ్యసించాలని కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గురువారం మండలములోని స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సొసైటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని కెజిబివిలో ప్రతిభా పరీక్షా నిర్వహించారు. పాఠశాలలోని 8,9,10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షా నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు అందించారు. అదేవిధంగా విద్యార్థులు ఒకే రంగంలో కాకుండా వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనిత, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యుడు అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్న పవన్‌కల్యాణ్

చేసిన మంచిని ప్రజలకు వివరిద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరిద్దామని నవాజ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో వైసిపి మండల అధ్యక్షులు సదాశివరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లతో కలసి వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఆయనతో పాటు మదనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జింకాచలపతి, తట్టి శ్రీనివాసులు, ఎంపిపి నరసిం హులు, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నిరంతరం ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి, ప్రజలకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే భేదాభిప్రాయం లేకుండా ప్రతి కుటుంబానికి ఆయన ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చారని, వారి అభివృద్ధి కోసం అండగా నిలబడ్డారని అన్నారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల సచివాల యాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, మహదేవరెడ్డి, వరలక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై కార్మికుల సంబరాలు

కమిషనర్ మనోహర్‌ను సన్మానిస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మున్సిపల్ పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి వేతనాలు పెంచడంతో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం సంబరాలు చేసుకున్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, కమిషనర్ మనోహర్‌ను కలిసి పుష్పంగుచ్ఛం అందించి దుశ్శాలువా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల పెంపుకోసం ఎన్నో ఏళ్లుగా నిరీక్షించామని ఇన్ని రోజులకు తమ కల నేరవేరిందన్నారు. అరకొర జీతాలతో అనేక ఇబ్బందులను పడ్డామని అన్నారు. వేతనాలను తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డికి, కమిషనర్ పి.ఆర్.మనోహర్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ఆర్.ఐ.శ్రీనివాసులు, ఎఇ రాజేంద్ర, ఒకటవ సచివాలయ కన్వీనర్ జి.చాంద్‌బాషా, నగర పంచాయతీ సిబ్బంది ఆవుల శ్రీనివాసులు, సమీర్, అంజి, మోహన, రాంబాబు, ఆవుల వెంకటరమణ, శివ ఆది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ముందస్తు దీపావళి

వేతనాలు పెరగడంతో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బంది కుటుంబాల్లో ముందస్తు దీపావళి పండగ వచ్చిందని వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ కితాబునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కూడా చాలీ చాలని జీతాలతోనే బ్రతుకీడుస్తున్న నగర పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి వైసిపి ప్రభుత్వం ఆఫ్ కాస్ట్ కింద జీతాలు పెంచడం జరిగిందన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి

మండలంలోని గ్రామస్థాయి అధికారులకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్లలకు వివాహ వయసు రాకుండానే వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని అన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల వారికి సంసార బాధ్యతలో అవగాహన లోపం సంక్రమించి బాధ్యతలు విస్మరించేందుకు అవకాశాలు తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా చిన్న వయసులో వివాహాలు జరిపిస్తే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. బాల్య వివాహాలు జరిపించినా, సహకరించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గ్రామాల్లో ఉన్న వాలంటీర్లు, మహిళా పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 గురించి బాల్య వివాహం జరిగితే, ఏ అధికారులు ఎలాంటి శిక్షలు వేస్తారనే అంశాలపై తహసిల్దార్ ప్రదీప్ వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం రమేష్, ఎంఇఒ మునేంద్రనాయక్, ఇఒపిఆర్‌డి ప్రతీఫ్‌ఖాన్‌అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులు లబ్ధిపొందేలా చర్యలు : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పాడిరైతులకు లబ్ధి చేకూరేలా పశుసంవర్ధకశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఎక్కువ మంది పాడి రైతులకు లబ్ధి చేకూరాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ఒక రైతుకు 35 శాతం రాయితీతో లక్ష రూపాయలు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారని అన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజంసుకుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సమర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ విజయ్‌భాస్కరరావు, పరిశ్రమల ప్రోత్సాహక అధికారి భువనేశ్వరి, తహశీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి :'చింతల'

ఎమ్మెల్యేను సన్మానించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-గుర్రంకొండ

అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం గుర్రంకొండ మండలంలో నడిమి కండ్రిక గ్రామంలో గడపగడప కార్యక్రమంలో పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన, మైనార్టీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాలతో పాటు మహిళ సాధికారత విజయం సాధించే విధంగా చర్యలు చేపట్టిందని అన్నారు. నాడు-నేడు పథకంతో ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల నిర్మించారని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాల రారాజుగా వెలుగుతుందన్నారు. నడిమి కండ్రిక గ్రామంలో ఆర్‌బికె చైర్మన్ జయచంద్రారెడ్డి తనయుడు సుధీర్ రెడ్డి ప్రజలు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు యోగేంద్ర, గుర్రంకొండ మాజీ సర్పంచ్ జామీర్, అలీఖాన్, సింగల్ విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ మస్తాన్ రెడ్డి, ఎంపిటిసి కదిరుల్ల నాయిని, శివశంకర్, నాగేంద్ర కుమార్, జ్యోతి రెడ్డి, ప్రభాకర్, వైస్ ఎంపిపి కరుణాకర్, తహశీల్దార్ ఖాజాబీ పాల్గొన్నారు.

జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ లోకవర్ధన్

ప్రజాశక్తి-కలికిరి

ఉమ్మడి కడప జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా స్థానిక డాక్టర్ లోకవర్ధన్‌ను నియమించినట్లు ప్రభుత్వ ఉత్తర్వులు అందినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర కరోన విపత్కర సమయంలో ఇన్‌ఛార్జి డి హెచ్‌ఎంఒగా పని చేసి అనేక సేవలు ప్రజలకు అందించి అనంతరం డిపిఎంఒగా పదవోన్నతి పొందాడు. గత రెండు సంవత్సరాలు తరువాత ప్రభుత్వం ప్రస్తుతం ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ గా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నియామకపై స్థానిక మండల కేంద్రంలోని వివిధ సంఘాలు, వైసిపి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం నాపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతను సక్రమమైన పద్ధతిలో నిర్వహిస్తానని అనేక మందికి సేవలు చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఐరన్ సుక్రోజ్‌తో రక్తహీనతకు స్వస్తి

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణుల ఆరోగ్య సమస్యల్లో ఒకటైన రక్తహీనతను ఐరన్ సుక్రోజ్ సూదిమందుతో నిర్మూలించవచ్చని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి రక్తహీనతతో బాధపడుతున్న పరిసర ప్రాంత గర్భిణులు సూచనలు, సలహాలతో పాటు రక్తవృద్ధికి సహకరించే ఐరన్ సుక్రోజ్ సూదిమందు సెలైన్ సాధన ద్వారా ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తహీనత అవగాహన లోపంతో కూడిన ఒక సామాజిక సమస్య అని, ఈ సమస్య గర్భిణుల్లో ఉంటే పిండంపై తీవ్ర చెడు ప్రభావం చూపి, నెలలు నిండకనే కాన్పులు, తక్కువ బరువుతో శిశు జననం వంటి సమస్యలతో పాటు మాతాశిశు మరణాలు కూడా జరగచ్చని అన్నారు. కావున ప్రతి గర్భిణి తాజా ఆకుకూరలు, కాయ గూరలు, పండ్లు, పాలు, గుడ్లు, తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తినాలని అప్పుడే ప్రతి తల్లీ మేలైన, ఆరోగ్యవంతమైన శిశువుని, ఇటు కుటుంబానికి, అటు సమాజానికి ఇవ్వగలుగుతుందని డాక్టర్ రమేష్ రెడ్డి గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సలహాలిచ్చారు.గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, స్టాఫ్ నర్స్ లు శిరీష, సునీత పాల్గొన్నారు.

సాంకేతిక సామర్థ్యం పెంపుపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సాంకేతిక సామర్థ్యం పెంపుపై రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని మదనపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు దీక్ష కుమారి తెలిపారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో నియోజకవర్గంలోని రైతు భరోసా సిబ్బందికి జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా పెరుమాళపల్లి బిఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త మాధవిలత మాట్లాడుతూ రబి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని రాగి, కొర్ర, అండ్రు కొర్రలు,సామలు మొదలైన పంటల సాగులో విత్తన నమోదు,మొక్కల సాంద్రత, కలుపు నివారణ మరియు సమగ్ర పంట యాజమాన్యం గురించి వివరించారు.కలికిరి కెవికె శాస్త్రవేత్త సోమశేఖర్ మాట్లాడుతూ రబి వేరుశనగలో పాటించ వలసిన విత్తన మోతాదు, మొక్కల సాంద్రత సమగ్ర సస్యరక్షణ యాజ మాన్యం మరియు కలుపు యాజమాన్యం,నూతన కలుపు నివారణ రసాయనాల గూర్చి వెల్లడించారు. జిల్లా వనరుల కేంద్రం నుండి డిడిఎ సావిత్రి, ఎడిఎవి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ వరి,వేరుశనగలో మేలైన యాజమాన్య పద్ధతుల గూర్చి తెలిపారు. ఇ-క్రాప్-2023 ఫిజికల్ అక్ నాలెడ్జ్ మెట్స్ వివరణ, మట్టి నమూనాల సేకరణ ఎరువులు ఇండెంట్స్, గురించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, నాగప్రసాద్, యు.మురళీమోహన్, జి.మోహన్ కుమార్, ఝూన్సీలక్ష్మి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

స్టేషన్ పరిధిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ పరిధిలో శుభ్రత-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతంలో చుట్టుపక్కల ఉన్నవారు వారికి సంబంధించిన వస్తువు సామగ్రిని వేసి ఆపరిశుభ్రంగా మార్చడంతో పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సిఐ నాగేంద్ర ఆదేశానుసారం ఎస్ఐ చొరవ తీసుకుని స్టేషన్ పరిసర ప్రాంతాలను జెసిబి సహాయంతో శుభ్రం చేయించినట్టు తెలిపారు.పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని శుబ్రత పరిశుభ్రతను చేపట్టి స్టేషన్ పరిధిలో ఎలాంటి అక్రమ వస్తువులు వ్యక్తపదార్థాలు ఉంచకుండా కూసాలు ఏర్పాటు చేసి స్టేషన్ సరిహద్దులుగా ఏర్పాటు చేసి కంచెను వేస్తామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు ఇరువైపుల నివాసమున్న వారు స్టేషన్ ఆవరణలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు వేయరాదని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ హరిబాబు, రమేష్ కుమార్, డ్రైవర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పవనన్న ప్రజాబాటలో మలిశెట్టి వెంకటరమణ

టిడిపి, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్రాభివృద్ధి జనసేన, టిడిపి తోనే సాధ్యమని రాజంపేట నియోజకవర్గం జనసేన పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం నందలూరు లో 119 వ రోజు పవనన్న ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ రూపొందించిన కరపత్రాలను, పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను, గాజు గ్లాసు గుర్తు ప్రజల్లోకి తీసుకెళ్లార. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, జనసేన నాయకులు భాస్కర పంతులు, వీరయ్య ఆచారి, గోపి,చౌడయ్య, పోలిశెట్టి శ్రీనివాసులు, గోవర్ధన్, కిషోర్ ,వెంకటసుబ్బయ్య , జనసేన వీర మహిళలు జడ్డ శిరీష, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా ఐటిఐ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లిలోని ప్రభుత్వ ఐటిఐలో 2021-23 సంవత్సరానికి గాను ఐటిఐలో శిక్షణ పొంది పాస్ అయినటువంటి 74 మంది విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఐటిఐ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు విద్యార్థులకు ఐటిఐ ధ్రువీకరణ పత్రాలతో పాటు రూ.18 వేలు జీతం కలిగిన ఉద్యోగ పత్రాలను అందించారు. వేడుకల్లో ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి పోటీలకు 'గురుకుల' విద్యార్థులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభచాటి జిల్లాస్థాయి పోటీలకు స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు దేష్‌ముఖ్ తెలిపారు. గురువారం ములకలచెరువు మండలం దేవులచెరువు జడ్‌పిహైస్కూల్లో నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. అండర్ -17 హై జంప్‌లో రెడ్డప్పనాయక్ మొదటి స్థాన, త్రిపుల్ జంప్‌లో సంతోష్ ద్వితీయ స్థానం నిలిచారు. అండర్-17, 200 మీటర్ల పరుగు పందెంలో ఎం .సంతోష్ నాయక్ మొదటి స్థానం దక్కించుకున్నాడు. అండర్ - 14 హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ 200 మీటర్ల పరుగు పందెంలో నిరంజన్ నాయక్ మొదటి స్థానంలో నిలిచారు. అండర్-14 , 400 మీటర్ల పరుగు పందెంలో నాగేంద్రబాబు మొదటి స్థానం దక్కించుకున్నాడు. అండర్-14 షాట్‌పుట్‌లో గణేష్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంఇఒత్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ నిర్మాణాలకు మార్కింగ్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండలో ఆలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. గురువారం ఎండోమెంట్ ఇంజినీరింగ్ మల్లయ్య కొండకు వచ్చారు. మల్లయ్య కొండ కింద ఆంజనేయ స్వామిగుడి, వినాయకుడుగుడి, వెలుగు మల్లమ్మగుడి, కొండపైగౌరమ్మతల్లి గుడి, ఆలయ పునర్నిర్మాణాలు నిర్మించేందుకు ఎండోమెంట్ ఇఇ సతీష్, డిఇ గంగయ్యల ఆధ్వర్యంలో మార్కింగ్ ఇచ్చారు. ఈ ఆలయాల పునర్నిర్మాణం మహాశివరాత్రి పండుగలోపు పూర్తిచేసే విధంగా కృషి చేస్తానని కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో మల్లయ్య కొండ చైర్మన్ మర్రెడ్డి, ఈవో రమణ, వైస్ ఎంపిపి కరీం, రామ్మూర్తి పాల్గొన్నారు.

నూతన ఆలయానికి మార్కింగ్ వేస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కస్తూరి రాజు గారి పల్లి పరిసర ప్రాంతాలలో పేకాట ఆడుతుండగా గురువారం దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతాలలో నాటసార స్థావరాలపై తనిఖీలు నిర్వహిస్తుండగా పేకాటరాయుళ్లు దొరికార, వీరి వద్ద నుంచి రూ.25వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నటు ఎస్ఐ తెలిపారు.